# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- “వికసిత్ ఆంధ్రప్రదేశ్” లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.
- గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహిస్తామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ తెలియజేశారు.
- ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లకు సూచించారు.
- రాష్ట్రవ్యాప్తంగా అధికారులు ఈరోజు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“వికసిత్ ఆంధ్రప్రదేశ్” లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర పునర్నిర్మాణానికి ఈ సమావేశం దోహదపడుతుందని, అధికారులు జవాబు దారీతనంతో పని చేయాలని సూచించారు. కొన్ని శాఖలు రాష్ట్ర అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అభివృద్ధితోనే ఆదాయమని, ఆదాయం వస్తేనే ప్రజలకు సంక్షేమం అందించగలుగుతామన్నారు. ప్రతి నెలా ఒకటవ తేదీన ‘పేదల సేవలో’ అనే కార్యక్రమంలో అధికారులు పాల్గొని ప్రజలతో మమేకం కావాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. పేదరిక నిర్మూలనకు కలెక్టర్లు వినూత్న ఆలోచనలు చేయాలని సూచించారు. అలాగే అక్టోబర్ 2వ తేదీన 2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహిస్తామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ తెలియజేశారు. ఈరోజు కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకానికి న్యాయం చేసి, వ్యవస్థలను బలోపేతం చేయాలన్నారు. అలాగే గ్రామ పంచాయతీలకు బలం చేకూర్చేందుకు గ్రామ సభలు దోహదపడతాయన్నారు. వీటిలో భాగంగా ఉపాధి హామీ గ్రామసభలను మొదటి సారిగా పిఠాపురం నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపడతామని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తోందని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లకు సూచించారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో గనుల శాఖ గురించి కలెక్టర్లకు ఆయన పలు సూచనలు చేశారు. ఉచిత ఇసుక విధాన నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టడానికి కఠినంగా వ్యవహరించాలన్నారు. ఏ ఏ ప్రాంతాల్లో ఖనిజాల అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనేది గుర్తించామని, దాని ప్రకారం సత్వర చర్యలకు ఉపక్రమించాలని ముఖేష్ కుమార్ మీనా అధికారులకు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రవ్యాప్తంగా అధికారులు ఈరోజు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజలను నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులకు వీలైనంత త్వరగా పరిష్కరం చూపుతామని విజయనగరం జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి. అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ఈరోజు కలెక్టర్ కార్యకాయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన వినతులే అధికంగా వచ్చాయని, మొత్తం 265 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి 130, పింఛన్లు మంజూరు, తదితర అంశాలపై 87 వినతులు అందాయన్నారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజల నుండి జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు 148 అర్జీలను స్వీకరించారు. ప్రజలు సంతృప్తి చెందేలా, త్వరితగతిన అర్జీలను పరిష్కరించాలని శ్రీకాకుళం జిల్లా ఇన్‌ఛార్జ్ సంబంధిత రెవిన్యూ అధికారి అప్పారావు అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మన సంప్రదాయ చేనేత వస్త్రాలను ప్రోత్సహించుకోవాల్సిన బాధ్యత అందరిపై వుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షులు ప్రేమకుమారి అన్నారు. ఈనెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మహిళా మోర్చా కార్యకర్తలు చేనేత చీరల ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలన్న జాతిపిత మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపుతో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 7వ తేదీన, 9 సంవత్సరాల క్రితం చేనేత వస్త్ర దినోత్సవానికి నాందిపలికారన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములతో కూడిన మెరుపులు, గంటకు ౩౦ నుంచి 40 కిలోమీటర్ల వేగముతో బలమైన గాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి వివరిస్తూ....

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అటవీ విస్తీర్ణం పెంచే దిశగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరామ్ కోరారు. ఈ రోజు కలెక్టర్ల సమావేశంలో ఆయన రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం పెంచాల్సిన ఆవశ్యతకత గురించి వివరించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. అలాగే వనం-మనం, నీరు-చెట్టు, వనం పిలుస్తోంది లాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో హరిత ఛత్రం (గ్రీన్ కవర్) విస్తరించడానికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. అడవులు పెంచే చర్యల్లో భాగంగా 13.5 కోట్ల రూపాయలతో విత్తనాలు వెదజల్లే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి జిల్లాలో 50 లక్షల విత్తనాల సీడింగ్ పనులు చేపట్టే కార్యక్రమాలను కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు రావడంతో నాగార్జున సాగర్ 2 గేట్లు తెరచి నీటిని దిగువకు వదిలామని నాగార్జునసాగర్ ఎస్ఈ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మొత్తం 8 గేట్లు ద్వారా, లక్ష నుంచి 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయనున్నామని వివరించారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఇన్ ఫ్లో 3 లక్షల 23 వేల 748 క్యూసెక్కులు ఉండగా, ఔట్ ఫ్లో 83 వేల 331 క్యూసెక్కులుగా ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు ఉండగా, ప్రస్తుత నీటి మట్టం 582.60 అడుగులకు చేరింది. 312.50 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి ప్రస్తుత నీటి నిల్వ 290.51 టీఎంసీలుగా ఉంది.

కాగా సాగర్ వద్ద నీటిని వదిలిన దృశ్యాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏజెన్సీ ప్రాంతాల్లో యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలుకు అలవాటు పడకుండా నిరోధించేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు పోలీసులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గంజాయి సాగు, రవాణా వంటి తీవ్రమైన నేరాల్లో పాలుపంచుకోకుండా ఉండేందుకు, అలాగే ఇటువంటి కేసులకి సంబంధించిన నేర తీవ్రతను ప్రజలకు విద్యార్థులకు వివరించారు. జిల్లాలోని ముంచంగిపుట్టు, పెద్దబయలు, వి.ఆర్.పురంలో గిరిజనులకు, యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దీరాజ్, చింతూరు ఏ ఎస్పీ రాహుల్ మీనా ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతి ఒక్కరూ హర్ గర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అనంతపురం జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సంధిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈరోజు నుంచి జిల్లాలో హర్ ఘర్ తిరంగాపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈనెల 11, 12, 13వ తేదీల్లో తిరంగ యాత్ర పేరుతో బైక్ ర్యాలీలు చేపడతామని అన్నారు. అలాగే ఆగస్టు 14న "విభజన విభీషక సంస్కరణ దివాస్" నిర్వహిస్తామని తెలిపారు. ఆగస్టు 15వ తేదీన ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఉండేలా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దాసరి శకీల అన్నారు. ఈరోజు ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రజలకు ఉచిత వైద్యం అందించే లక్ష్యంతోనే సర్వజన ఆసుపత్రి సేవలు అందిస్తుందని వెల్లడించారు. సూపర్ స్పెషాలిటీ వైద్యానికి సంబంధించిన అన్ని, మౌలిక సదుపాయాలతో పాటు, ఎటువంటి శస్త్ర చికిత్సలు అయినా పూర్తి చేయటానికి అనుభవిజ్ఞులైన వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలకు జీజీహెచ్ అనుబంధ ఆస్పత్రిగా ఉందని.. ఇక్కడ వైద్య కళాశాలలో పీజీ విద్యతో పాటు 159 యూజీ సీట్లను ప్రతీ సంవత్సరం భర్తీ చేస్తున్నామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =